విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, మంగళవారం 27, మే 2025

కౌలు రైతుల సమస్యలను పరిష్కరించండి ..

విశాలాంధ్ర–ఉరవకొండ: మండలంలో కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కౌలు రైతు సంఘం నాయకులు సోమవారం తాహసిల్దార్ మహబూబ్ బాషా కు విజ్ఞప్తి చేస్తూ వినతిపత్రాన్ని అందజేశారు. సోమవారం కౌలు రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ కౌలు రైతుల అందరికీ అన్నదాత సుఖీభవ పథకం కింద రూ,20వేలు అందించాలని విత్తనాలు, పురుగు మందులు ఎరువులు 90 శాతం సబ్సిడీతో మంజూరు చేయాలని, వేరుశనగ విత్తనాలు ప్రతి కౌలు రైతు కు ఆరు ప్యాకెట్లు ఇవ్వాలని భూమిలేని నిరుపేదలకు గతం నుండి సాగులో ఉన్నవారికే కౌలుకి ఇవ్వాలన్నారు. శ్రీరామ్ రెడ్డి సత్యసాయి వాటర్ వర్కర్స్ కార్మికుల సమస్యలు పరిష్కరించి తాగునీటి సమస్యలు పరిష్కరించాలని షరతులులేకుండా ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతులకు గ్రామ పంచనామా ఆధారంగా రూ.10 లక్షల పరిహారం మంజూరు చేయాలన్నారు. హంద్రీనీవా కాలువను 10 వేల క్యూసెక్కులు సామర్థ్యంతో వెడల్పు చేసి పిల్ల కాలువలు ఏర్పాటుచేసి చివరి ఆయకట్టు వరకు తాగు, సాగునీరు ఇవ్వాలని, లైనింగ్ పనులను తక్షణమే ఆపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రంగారెడ్డి జిల్లా కార్యదర్శి బాల రంగయ్య, తాలూకా అధ్యక్షులు సురేష్ కార్యదర్శి పెద్ద ముస్తూరు వెంకటేష్ రైతు సంఘం నాయకులు రామ్మూర్తి, నారాయణస్వామి. ఆంజనేయ సుంకన్న పాల్గొన్నారు.

పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచండి

విశాలాంధ్ర–ఉరవకొండ: ఉరవకొండ మేజర్ గ్రామపంచాయతీలో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలలో భాగంగా పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని పంచాయతీ వార్డు సభ్యులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. సోమవారం స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ మీనుగా లలిత అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కొంతమంది వార్డు సభ్యులు మాట్లాడుతూ వర్షాలు కురవడమే కాకుండా కరోనా వ్యాధి కి సంబంధించి రాష్ట్రంలో అక్కడక్కడ కేసులు నమోదవుతున్నాయని, వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని పారిశుధ్యాన్ని మెరుగుపరిచి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలన్నారు. గ్రామపంచాయతీ ఖర్చులకు సంబంధించి బిల్లులను పారదర్శకంగా పెట్టాలన్నారు. ఉరవకొండలో జరిగిన గవి మఠం రథోత్సవానికి సంబంధించి నాలుగు లక్షల రూపాయలు ఖర్చుపెట్టి నట్లు చెబుతున్నారని దేనికి ఎంత ఖర్చు పెట్టారో వివరాలు వెల్లడించాలని వార్డు సభ్యులు రవి ఆరోపించారు. సభ్యులు లేవనెత్తిన ఆరోపణలపై కార్యదర్శి గౌస్ సాహెబ్ మాట్లాడుతూ సభ్యులకు ఆధారాలతో సహా ఖర్చులకు సంబంధించి వివరాలను వెల్లడిస్తామని పేర్కొన్నారు.

ఉచితంగా మొక్కల పంపిణీ

విశాలాంధ్ర–కూడేరు : మండల పరిధిలోని పి.నారాయణ పురం గ్రామ సచివాలయంలో హందా సంస్థ ప్రతినిధి నారాయణ స్వామి ఆధ్వర్యంలో అగ్రోఫారెస్ట్రీ కార్యక్రమం నిర్వహించారు. మామిడి, చినీ, నేరేడు, నిమ్మ వంటి పండ్ల మొక్కలు సంస్థ ద్వారా ఉచితంగా పంపిణీ చేయబడ్డాయి. బోరు డ్రిప్ సౌకర్యం ఉన్న రైతులకు ప్రాధాన్యత ఇవ్వబడింది. అలాగే మహాగని, ఎర్రచందనం, టెకాయ్ వంటి విలువైన వృక్షాల మొక్కలు కూడా అందుబాటులో ఉంటాయన్నారు రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని, ఆయా మొక్కలు పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కే.హనుమంత రెడ్డి, హ్యాండ్స్ సంస్థ కోఆర్డినేటర్ నాగలక్ష్మి, ఫీల్డ్ కోఆర్డినేటర్ ప్రతినిధి హరి పాల్గొన్నారు.

గోవధను అరికట్టాలని కలెక్టర్‌కు వినతి..

విశాలాంధ్ర–తాడిపత్రి : పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో గోవదను అరికట్టాలని జైశ్రీరామ్ భక్తమండలి అధ్యక్షులు నిచ్చెనమెట్ల రాధాకృష్ణ జిల్లా జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ హిందువుల ఆరాధ్య దైవమైన గోమాతలను (గోవులను) జూన్ ఏడో తారీఖున జరిగే బక్రీద్ సందర్భంగా హిందువుల పరమ పవిత్రమైన గోమాతలను కొంతమంది ముస్లింలు వధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకు సంబంధించి గోవధను అరికట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గోవుల అక్రమ రవాణా జరగకుండా జిల్లా సరిహద్దులలో చెక్ పోస్ట్ లు ఏర్పాటు చేసి గోవులను పరిరక్షించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో జైశ్రీరామ్ భక్తమండలి సభ్యులు గంగాధర యాదవ్, నారాయణస్వామి పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్ర్రాలకు చేరిన సబ్సిడీ వేరుశెనగ

విశాలాంధ్ర–కూడేరు : ఖరీఫ్ 2025కు సంబంధించి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కూడేరు మండల వ్యాప్తంగా సబ్సిడీ వేరుశెనగ విత్తన కాయలు 800 క్వింటాళ్లను 8 రైతు సేవా కేంద్రాలకు పంపింది. గొటుకూరు, కమ్మూరు వేరుశెనగ షెల్లింగ్ శాతం కనీస 74 శాతం కంటే తక్కువ వున్న కారణంగా వెనుక్కు పంపామని వ్యవసాయ అధికారి విజయకుమార్ తెలియజేశారు, మంగళవారం సాయంత్రంలోపు మండలం వ్యాప్తంగా మిగిలిన రైతు సేవా కేంద్రాలకు వేరుశెనగ కాయలు చేరిన తరువాత వారం రోజుల్లో రైతులకు అందజేస్తామని తెలిపారు సబ్సిడీ వేరుశెనగ క్వింటాలుకు రూ.9,300 కాగా 40 శాతం సబ్సిడీ పోను రూ.5,580లు రైతులు కట్టాల్సి వుంటుంది. 0.5 ఎకరా వున్న రైతుకు బస్తాధర 1860 రూ,1.0లోపు వున్న రైతుకు 2 బస్తాలు 3620, 2 ఎకరాలపై వున్న రైతుకు గరిష్టంగా 3 బస్తాలు రూ.5,580గా ధరను నిర్ణయించామని చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓ శైలజ, రైతు సేవకేంద్ర సిబ్బంది టీడీపీ నాయకుడు జయప్రకాష్ గౌడ్, బాట.వెంకటేష్ పాల్గొన్నారు.

నంబాల కేశవరావు బూటకపు ఎన్‌కౌంటర్‌పై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీష్

విశాలాంధ్ర–గుంతకల్లు : మావోయిస్టు పార్టీ జాతీయ కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజును మరో 27 మంది ఆదివాసులను అత్యంత కిరాతకంగా బూటకపు ఎన్‌కౌంటర్‌తో హత్యలు చేయడాన్ని సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి జగదీష్ తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ చత్తీగడ్ దండకారణ్యంలోని అబూజ్ మడ్‌లో మావోయిస్టు పార్టీ జాతీయ కార్యదర్శి నంబాల కేశవరావు, కొందరు మావోయిస్టులు సంచరిస్తున్నారని.. కేంద్ర బలగాలకు సమాచారం ఉన్నదని కూబింగ్ చేస్తూ ఉంటే ఎదురు కాల్పుల్లో మావోయిస్టు నాయకులు, కార్యకర్తలు మరణించినారుని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం పచ్చి అబద్ధం, ఒరిస్సాలో అనారోగ్యంతో ఉన్న మావోయిస్టు పార్టీ జాతీయ కార్యదర్శి నంబాల కేశవరావు ను అక్కడ పట్టుకొని వచ్చి కాల్చి చంపడం జరిగినదినీ మండిపడ్డారు.ఆదివాసులు నివసిస్తున్న దండకారణ్యంలో అపార ఖనిజ నిక్షేపాలు ఉన్నాయి. వాటిని కార్పొరేట్ కంపెనీలకు కేంద్ర ప్రభుత్వం అప్పజెప్పడానికి ఆపరేషన్ కగార్ ను ఏర్పాటు చేసి లక్షల మంది పారామిలటరీ దళాలతో కూబింగ్ ఆపరేషన్లను నిర్వహిస్తూ మావోయిస్టు పార్టీ నాయకులను, కార్యకర్తలు, ఆదివాసులను పట్టుకొని ఎన్‌కౌంటర్ల పేర్లతో హత్యలు చేస్తూ గిరిజనుల ప్రాంతాలలో రక్తపుటేరులు పారించి వారిని భయభ్రాంతులకు గురి చేయడం జరుగుతుందని పహల్గంలో టూరిస్టులు 26 మంది మరణించిన కేంద్ర ప్రభుత్వం పాకిస్థాన్ తో కాల్పుల విరమణ ఒప్పందాన్ని చేసుకున్నది కానీ మావోయిస్టు పార్టీ తానే ముందుకొచ్చి కేంద్ర ప్రభుత్వంతో శాంతి చర్చలకు సిద్ధమని తెలుపుతూ ఉంటే వారి మీద తీవ్ర అణిచివేతను కొనసాగిస్తూ వారిని బూటకపు ఎన్‌కౌంటర్లతో హత్యలు చేయడం మంచిది కాదని మావోయిస్టు పార్టీ జాతీయ కార్యదర్శి నంబాల కేశవరావు, మరో 27 మంది హత్యల మీద సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి ద్వారా న్యాయ విచారణ జరిపించాలి . మోడీ ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను రద్దు పరచాలి, కేంద్ర ప్రభుత్వం వెంటనే మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలను జరపాలని కోరారు.

కూటమి నాయకులిచ్చిన వాగ్ధానాలను వెంటనే నెరవేర్చాలి

జూన్ 2న ఉద్యమం, రైతులకు భరోసా ఏదీ ? సిపిఐ జిల్లా కార్యదర్శి జాఫర్

విశాలాంధ్ర–కణేకల్లు: ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చి దాదాపు సంవత్సరం పూర్తవుతున్నా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమయ్యారని, దీనిపై జూన్ 2న పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ అన్నారు. శత వార్షికోత్సవం సందర్భంగా కనేకల్‌లో నాల్గవ మహాసభ సందర్భంగా సోమవారం జిల్లా కార్యదర్శి జాఫర్ జిల్లా కార్యవర్గ సభ్యులు సంజీవప్ప రాయ దుర్గం తాలూకా కార్యసభ్యులు నాగార్జున ముఖ్య అతిథులుగా సిపిఐ పార్టీ కార్యాలయం ముందు ఏర్పాటుచేసిన బహిరంగ సభకు హాజరయ్యారు. జాఫర్ మాట్లాడుతూ వైయస్ రాజశేఖర్ రెడ్డి పాలనలో ప్రజలకు చేసిన మేలును చూసి ఆయన కుమారుడు జగన్మోహన్ రెడ్డికి 151 స్థానాలు ఇచ్చి ప్రజలు ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చొబెట్టారని అన్నారు. కానీ జగన్మోహన్ రెడ్డి నవరత్నాలు అనుకుంటూ ఇసుక మాఫియా మందు మాఫియాతో అయ్యవారితో కూడా మద్యాన్ని అమ్మించారన్నారు. జగన్మోహన్ రెడ్డి పాలనకు విసుగెత్తిన ప్రజలు ఎన్డీఏ కూటమి వాగ్దానాలు చేసిన మాటలకు ఆకర్షితులై నూట అరవై నాలుగు సీట్లతో గెలిపించినా ఇచ్చిన వాగ్దానాలలో ఒక పెన్షన్ మాత్రమే అమలు చేశాడని దుయ్యబట్టారు. మహిళలకు మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తామని చెప్పి కేవలం ఒక సిలిండర్ మాత్రమే ఉచితంగా ఇచ్చి చేతులు దులుపుకున్నారు. అలాగే ఉచిత బస్సు అన్నారు .డబ్బులు పెట్టిన బస్సులకే మరమ్మతులు లేవన్నారు. తల్లికి వందనం, 15 ఏళ్ల నిండిన వారికి 15000 ఎక్కడ రైతు సుఖీభవ కింద రూ.20 వేలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఇల్లు లేని పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు రెండు సెండ్ల స్థలం రూ.5 లక్షలు వెంటనే ఇవ్వాలన్నారు. ఈ క్రాప్ బుకింగ్ లేదని పంటలు కొనుగోలు చేయకుండా ఇబ్బందికి గురి చేశారన్నారు. దీంతో దాదాపు క్వింటాలకు రూ.500లు తక్కువతో అమ్మి రైతులు నష్టపోతున్న ఈ ప్రభుత్వానికి చలనం లేదన్నారు. గత సంవత్సరం కనేకల్ బ్రిడ్జి కూలడానికి సిద్ధంగా ఉన్న బ్రిడ్జిని మరమ్మత్తులు చేయాలని ర్యాలీ చేపట్టినా స్పందన లేదన్నారు. కార్యక్రమంలో కనేకల్ మండలం సిపిఐ మండల కార్యదర్శి గౌస్ పీర్, సహాయ కార్యదర్శి ముల్లా సర్వస్వలి, బషీర్ అహ్మద్, హనుమేసు, చందా హుస్సేన్, పార్వతి ప్రసాద్, అబిదాబి, హసీనా, పద్మావతి, లలిత సిపిఐ కార్యకర్తలు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

జిల్లా అధ్యక్షులు వి.రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో–అనంతపురం: ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం అనంతపురం జిల్లా మహాసభలను జూన్ 8న జిల్లా కేంద్రంలోని నీలం రాజశేఖర్ రెడ్డి భవన్‌లో నిర్వహిస్తున్నామని.. విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు వి.రామకృష్ణ తెలిపారు. ఈ మేరకు మహాసభ కరపత్రాలను సోమవారం నగర శివారులోనే రుద్రంపేట పంచాయతీలోని విమల ఫరూక్ నగర్ సిపిఐ కార్యాలయంలో ఆవిష్కరించారు. రామకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయం, చేనేత రంగాల తర్వాత అత్యధికంగా ప్రజలు భవన నిర్మాణరంగం పైనే ఆధారపడి జీవిస్తున్నారని అయితే గత కొన్ని సంవత్సరాలుగా ముడి సరుకుల పెరిగాయన్నారు. గత ప్రభుత్వంలో తీసుకు వచ్చిన నూతన ఇసుక విధానం, లాక్‌డౌన్‌తో భవన నిర్మాణ రంగ కార్మికులు పనులు దొరక్క కూడేలు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక సంక్షేమ బోర్డు నిధులను సైతం గత ప్రభుత్వం దారి మళ్లించి కార్మికుల అందాల్సిన ప్రయోజనాలను అందకుండా చేసిందని విమర్శించారు. ఎన్నికల ముందు కూటమి నాయకులు తాము అధికారంలోకి వస్తే భవన నిర్మాణ రంగంలో సమస్యలన్నీ పరిష్కరిస్తామని, సంక్షేమ బోర్డులో పునరుద్ధరించి.. క్లైయిమ్‌లు చెల్లిస్తామని... వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చినా కూటమి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని విమర్శించారు.

బోర్డు ఖాతాలో ఉన్న ప్రస్తుతం రూ.4293 కోట్ల నిధులను మళ్లించకుండా, పెండింగ్లో ఉన్న 50వేల క్లైమ్‌లు వెంటనే పరిష్కరించాలని, 50 ఏళ్లు నిండిన కార్మికులకు పెన్షన్ సదుపాయం కోసం భవిష్యత్ పోరాటాలకు రూపకల్పనకు జూన్ 8న నీలం రాజశేఖర్ రెడ్డి భవన్‌లో నిర్వహించే భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా మహాసభల్లో కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. మహాసభలకు జిల్లా వ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికులు పెద్దఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ సీనియర్ నాయకులు బి.రామయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉప ప్రధాన కార్య కాగాదర్శి డోన్ రామాంజనేయులు, జిల్లా సహాయ కార్యదర్శి లక్ష్మన్న, నాయ కులు వడ్డే వెంకట రాముడు, ఉలిగప్ప, మల్లెల పెద్దన్న, ఆదినారాయణ, ఓం కుమార్, వీర, దేవేంద్ర పాల్గొన్నారు.

రైతులకు వ్యవసాయ పరికరాలు, సూక్ష్మ పోషకాలు అందించాలి

- రైతు సంఘం రాష్ట వర్కింగ్ ప్రెసిడెంట్ కాటమయ్య

విశాలాంధ్ర–అనంతపురం : రైతులకు వ్యవసాయ పరికరాలు, సూక్ష్మ పోషకాలు, అందించాలని రాష్ట రైతు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కాటమయ్య పేర్కొన్నారు. సోమవారం ఏపీ రైతు సంఘం జిల్లా సమితి ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. జిల్లా రైతు సంఘం అధ్యక్షులు చిన్నప్ప యాదవ్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథి రాష్ట్ర రైతు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కాటమయ్య మాట్లాడుతూ... ఖరీఫ్ సీజన్‌లో పండించే పంటలకు 90 శాతం సబ్సిడీతో విత్తనాలు, అన్నదాత సుఖీభవ అందించాలన్నారు. వ్యవసాయ పరికరాలు, సూక్ష్మ పోషకాలు, అందించాలని జూన్ మొదటి వారం నుండి ఖరీఫ్ ప్రారంభం అవుతుందన్నారు. జిల్లాలో ఇంతవరకు పంటల వారీగా ప్రణాళికలు, క్రెడిట్ ప్రణాళికలు, విత్తన ప్రణాళికలు ప్రకటించలేదన్నారు. సబ్సిడీ విత్తనాల కోసం రైతులు ఎదురు చూస్తున్నారన్నారు. జిల్లాలో 90 శాతం కౌలు రైతులే వ్యవసాయం చేస్తున్నారని.. వీరికి ఇంతవరకు కౌలు గుర్తింపు కార్డులు జారీ చేయలేదన్నారు. దీనివల్ల కౌలురైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని, రైతాంగ అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని కల్తీ, నకిలీ విత్తనాలు రైతాంగానికి అంట గట్టడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. జిల్లా రైతు సంఘం అధ్యక్షులు డి.చిన్నప్ప యాదవ్ మాట్లాడుతూ... నాణ్యతలేని విత్తనాలు అమ్ముతున్న షాపులపై జిల్లాలో ఎక్కడా కూడా తనిఖీలు నిర్వహించిన దాఖలాలు లేవన్నారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని ఇంత వరకు అమలు కాలేదన్నారు. అనంతరం కలెక్టరేట్లోని ఏవో అలెగ్జాండర్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు కార్యక్రమంలో జిల్లా అర్గనైజింగ్ సెక్రటరీవన్నారెడ్డి, జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షులు టి నారాయణస్వామి, వెంకట రాముడు యాదవ్, కౌలు రైతు సంఘం అధ్యక్ష కార్యదర్శులు వి.టి. రామాంజనేయులు, సనప రామకృష్ణ, జిల్లా రైతు సంఘం నాయకులు చలపతి, రామాంజనేయులు యాదవ్, లలితమ్మ, మధు యాదవ్, సిపిఐ రూరల్ నాయకులు రమేష్, రాము, చేనేత మధు, చికెన్ భాష, రామాంజనేయులు పాల్గొన్నారు.

ప్రజలంతా యోగాని నిత్యం అభ్యసించాలి

విశాలాంధ్ర–తాడిపత్రి: ప్రజలంతా యోగాని నిత్యం అభ్యసించాలని కలెక్టర్ వి. వినోద్ కుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని పెన్నా నది ఒడ్డున వెలసిన శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద యోగాంధ్ర–2025 కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఎమ్మెల్యే జెసి.అస్మిత్‌రెడ్డి హాజరయ్యారు. యోగా మాస్టర్ అందరి చేత యోగాసనాలు వేయించారు. కలెక్టర్ మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రముఖ పర్యాటక ప్రాంతాలలో యోగా కార్యక్రమాలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిందన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో అనంతపురం జిల్లాని అగ్రస్థానంలో నిలపాలని, నిరంతరం ప్రతి ఒక్కరూ యోగా చేసుకోవాలన్నారు. తాడిపత్రిలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం పట్ల ఎమ్మెల్యే జెసి.అస్మిత్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ జెసి. ప్రభాకర్ రెడ్డికి కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ పూజారులు జిల్లా కలెక్టర్‌కి పూర్ణకుంభంచే స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేసి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో డిఆర్ఓ ఏ.మాలోల, మున్సిపల్ వైస్ చైర్మన్స్ తలారి అరుణ, షేక్షావలి, ఆర్డీఓ కేశవనాయుడు, ఎస్డిసి మల్లికార్జునుడు, డిఐపిఆర్ఓ పి.గురుస్వామిశెట్టి, డిఎంహెచ్ఓ డా.ఈబి.దేవి, జిల్లా టూరిజం అధికారి జయ కుమార్ బాబు, డ్వామా పిడి సలీం భాష, ఎంపీడీవో ఫజిల్, ఈఓఆర్డీ వెంకటేష్, జనసేన నాయకుడు శ్రీకాంత్ రెడ్డి, వివేకానంద యోగ సెంటర్ గురువు వై.ఆంజనేయులు, యోగ సెంటర్ అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి, యోగ గురువు డాక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

విలేకరి నాగరాజు మృతికి సంతాపం

విశాలాంధ్ర–ఉరవకొండ: ఉరవకొండ హెచ్ఎంటీవీ రిపోర్టర్ గా పనిచేస్తున్న నాగరాజు ఆదివారం రాత్రి ఉరవకొండ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమా దంలో మృతి చెందారు. నాగరాజు మృతికి పలువురు నాయకులు, జర్నలిస్టులు సంతాపం తెలియజేశారు. సోమవారం నాగరాజు స్వగ్రామం బూదగవి గ్రామానికి వెళ్లి భౌతిక గాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. నాగ రాజు కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వామపక్ష విద్యార్థి సంఘంలో పనిచేసిన నాగరాజు కొంతకాలం విశాలాంధ్ర రిపోర్టర్ గా కూడా పనిచేసి అందరి మన్ననలు కూడా పొందినట్లు పలువురు నాయకులు పేర్కొన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై. మధుసూదన్ రెడ్డి, ఆ పార్టీ జిల్లా నాయకులు సోనియా సీన, ఉరవకొండ ఎంపీపీ వెలిగొండ నరసింహులు, మాజీ జెడ్పిటిసి సభ్యులు తిప్పయ్య, టిడిపి సీనియర్ నాయకులు ప్యారం కేశవానంద, ఏపీడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు పయ్యావుల ప్రవీణ్, యూనియన్ జిల్లా నాయకులు చౌడప్ప, స్థానిక జర్నలిస్టులు, ఆనంద్ రావు, రమేష్, షేక్షావలి, ఎర్రి స్వామి, ఉమాపతి, మంజునాథ, ఎర్రిస్వామి, నరసింహ నాయక్, వీరితోపాటు ఉరవకొండ రూరల్ సీఐ చిన్న గౌస్, తాసిల్దార్ మహబూబ్ బాషా, ఎంపీడీవో రవి ప్రసాద్, సిపిఐ, సిపిఎం, విద్యార్థి, దళిత, ప్రజా సంఘాల నాయకులు నాగరాజు భౌతిక గాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

విలేఖరి నాగరాజు కుటుంబానికి ఆర్థిక సహాయం

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విలేకరి నాగరాజు కుటుంబానికి హెచ్ఎంటీవీ యాజమాన్యం రూ.25 వేలు, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ రూ.10 వేల సహాయాన్ని అందించారు.

జీవో నెం.519 ద్వారా ఏర్పడిన కమిటీ వివరాలు తెలపాలి..

విశాలాంధ్ర బ్యూరో–అనంతపురం : ఏలూరు జిల్లా కోర్టు ఇచ్చిన జీవ నెం.519 ద్వారా ఏర్పడిన కమిటీ వివరాలు తెలపాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరు కార్యాలయ పరిపాలన అధికారి అలెగ్జాండర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు పి.నారాయణస్వామి మాట్లాడుతూ ఐదు సంవత్సరాలకొకసారి ప్రభుత్వాలు మారుతున్నాయి తప్ప అగ్రిగోల్డ్ కస్టమర్స్ సమస్యలు నేటికీ పూర్తి స్థాయిలో పరిష్కారం దిశగా ప్రయత్నాలు జరగకపోవడం అన్యాయమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్. సిద్దేశ్వర, జిల్లా ప్రధాన కార్యదర్శి డి.కుల్లాయప్ప, జిల్లా ఉపాధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, రైతు సంఘం నాయకులు చెన్నప్ప యాదవ్, సిపిఐ నగర సహాయ కార్యదర్శి బి. రమణయ్య, నగర కార్యవర్గ సభ్యులు ఎల్లుట్ల నారాయణస్వామి, సుందరరాజు, శ్రీనివాసులు, పాల్గొన్నారు.

జర్నలిస్ట్ నాగరాజు మృతి పట్ల సంతాపం

విశాలాంధ్ర, ఉరవకొండ: ఉరవకొండ హెచ్ఎంటీవీ విలేఖరి నాగరాజు మృతి పట్ల పలువురు వక్తలు సోమవారం సంతాపం తెలిపారు. ఏఐఎస్ఎఫ్ నాయకుడిగా, ఉరవకొండ విశాలాంధ్ర విలేకరిగా పనిచేసిన నాగరాజు ప్రస్తుతం హెచ్ఎంటీవీ ఉరవకొండ రిపోర్టర్గా పనిచేస్తున్నారు. ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలవడం దిగ్భ్రాంతికి గురి చేసిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్, జిల్లా కార్యదర్శి జాఫర్ విశాలాంధ్ర కర్నూల్ ఎడిషన్ మేనేజర్ నాగరాజు, అనంతపురం జిల్లా బ్యూరో ఇన్చార్జి సనప రామకృష్ణ, కళ్యాణదుర్గం సీనియర్ జర్నలిస్టు కరణం తిప్పేస్వామి, ఉరవకొండ విశాలాంధ్ర విలేఖరి షేక్షావలి సంతాపం తెలిపారు. అభ్యుదయ భావజాలంతో ప్రజల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళుతున్న నాగరాజు మృతి పట్ల తీవ్ర సంతాపం తెలిపారు. నాగరాజు కుటుంబ సభ్యులకు దేవుడు మనో ధైర్యాన్ని కల్పించాలని వేడుకున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలి..

విశాలాంధ్ర–అనంతపురం క్రైం: మండల కేంద్రంలోని ప్రాంతాల్లో పోలీసులు వెహికల్ చెకింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐ పుల్లయ్య మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాల మేరకు విస్తృతంగా వాహనాలు తనిఖీ నిర్వహిస్తూ, ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ప్రయాణికులకు, రోడ్డు భద్రతలో భాగంగా ప్రతి ఒక్కరూ హెల్మెట్, సీట్ బెల్టు, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐలు ఆదినారాయణ, మల్లికార్జున, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు సిబ్బంది పాల్గొన్నారు.

జగన్ రెడ్డి ఇలాఖాలో పసుపు సైన్యం బలం చూపిద్దాం

120 బస్సులు, వంద కార్లతో తరలివెళ్దాం

విశాలాంధ్ర బ్యూరో–అనంతపురం: ప్రతిపక్ష హోదా లేకపోయినా.. ప్రతిపక్ష నాయకుడిగా చెప్పుకునే పులివెందుల ఎమ్మెల్యే జగన్ మోహన్ రెడ్డి ఇలాకాలో జరిగే మహానాడు ద్వారా పసుపు సైన్యం బలం ఏంటో చూపిద్దామని అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పిలుపునిచ్చారు. మే 27 నుంచి మూడు రోజుల పాటు కడప జిల్లాలో జరిగే మహానాడుకి సంబంధించి ఆయన అర్బన్ నియోజకవర్గ నాయకులతో సోమవారం వరుస సమావేశాలు నిర్వహించారు. అర్బన్ టీడీపీ కార్యాలయంలో సమావేశం నిర్వహించగా మధ్యాహ్నం నియోజకవర్గ ముఖ్య నాయకులతో ఆర్.అండ్.బి అతిథి గృహంలో సమావేశం నిర్వహించారు. మహానాడు సమన్వయకర్త ఆకాశాపు స్వామి, జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, నియోజకవర్గ పరిశీలకుడు లక్ష్మీనారాయణ, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో విశాఖపట్నంలో మహానాడు జరగడం వలన చాలా మంది వెళ్లలేక పోయారని ఈసారి మనకు దగ్గర్లో నున్న కడపలో మహానాడు జరుగుతున్నందున నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తు హజరు కావాలన్నారు. ఇందుకోసం 120 బస్సులు, వంద వరకు కార్లు, ఇతర వాహనాలు ఏర్పాటు చేశామన్నారు. అలాగే 8వేల మంది వరకు వచ్చేలా ప్రణాళికలు చేసినట్టు చెప్పారు. గదులు, భోజన సౌకర్యం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈనెల 27, 28తేదీల్లో ముఖ్యనాయకుల సమావేశాలు మాత్రమే ఉంటాయన్నారు. డివిజన్‌లో కీలక నాయకులు, పార్టీ పదవుల్లో ఉండే నాయకులు మాత్రమే హాజరు కావాలన్నారు. 29న మాత్రం ప్రతి కార్యకర్త ఈ కార్యక్రమానికి రావాలన్నారు. మహానాడుకు వెళ్లే ప్రతి కార్యకర్త క్రమశిక్షణతో ఉండాలన్నారు. మహానాడు నియోజకవర్గ సమన్వయకర్త ఆకాశపు స్వామి, నియోజకవర్గ పరిశీలకు లక్ష్మీనారాయణలు మాట్లాడుతూ అర్బన్ నియోజకవర్గం లోని 50 డివిజన్లు, నాలుగు పంచాయతీల నుంచి కార్యకర్తలు మహానాడులో భాగస్వామ్యం కావాలన్నారు. బాగా పనిచేసే వారికి గుర్తింపు ఉంటుందన్నారు.

కూటమి ప్రభుత్వంలో కక్షసాధింపు రాజకీయాలు

- మాజీ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి అరెస్ట్ దారుణం
- అక్రమ కేసులకు భయపడం.. న్యాయ పోరాటం చేస్తాం..
- వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి



విశాలాంధ్ర బ్యూరో–అనంతపురం : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కక్షసాధింపు రాజకీయాలు ఎక్కువయ్యాయని వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. మాజీ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి అరెస్ట్‌పై ఆయన సోమవారం స్పందించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేక చంద్రబాబు నాయుడు డైవర్షన్ పాలిటిక్స్‌కు తెర లేపుతున్నారని, అందులో భాగంగానే మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని అరెస్టు చేశారన్నారు. అధికారం ఉందని అక్రమ కేసులు పెడుతూ పాలనను గాలికొది లేశా రని మండిపడ్డారు. రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగాన్ని పట్టించు కోకుండా, యథేచ్ఛగా రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారన్నారు. మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు, రిటైర్డ్ అధికారులందరినీ అరెస్ట్ చేస్తున్నారు. అక్రమ కేసులకు ఎవరూ భయపడేది లేదని, రాబోయే రోజుల్లో తగిన మూల్యం చెల్లించుకోవాల్సిన పరిస్థితి ఉంటుందన్నారు. అక్రమ అరెస్టులు, కేసులపై న్యాయ పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

విశాలాంధ్ర శ్రీ సత్యసాయి

www.visalaandhra.com   కర్నూలు, మంగళవారం 27, మే 2025

నిరుపేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి యం.వేమయ్యయాదవ్

విశాలాంధ్ర బ్యూరో శ్రీ సత్య సాయి : తనకల్లు మండలం బొంతలపల్లి గ్రామం సర్వేనెంబర్ 183-ఏ ప్రభుత్వ భూమి నందు గుడిసెలు వేసుకొని నివసిస్తున్న నిరుపేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం నందు ధర్నా నిర్వహించి ధర్నా అనంతరం కలెక్టర్ కి వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా సత్య సాయి జిల్లా సిపిఐ జిల్లా కార్యదర్శి యం. వేమయ్య యాదవ్ మాట్లాడుతూ భారత కమ్యూనిస్ట్ పార్టీ (సిపిఐ) మరియు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఇండ్లు లేని నిరుపేదలు దళిత బడుగు బలహీన వర్గాలకు చెందినటువంటి పేదలు గుడిసెలు వేసుకుని దాదాపుగా 150 కుటుంబాలు రోజు వారి కూలి పని చేసుకుంటూ 4 సంవత్సరాలనుండి ఇక్కడే నివాసం ఉంటున్నారు. ఇంటి పట్టాలు మంజూరు చేయాలని పలుమార్లు అధికారులకు అర్జీలను సమర్పించడం జరిగింది. అయినా అధికారుల నుండి ఎలాంటి స్పందన లేదు ప్రస్తుతం తనకల్లు తహసిల్దార్ గారు గుడిసెలు ఖాళీ చేయమని లేదంటే పోలీసుల సమక్షంలో గుడిసెలు తొలగిస్తామని అంతేకాకుండా గుడిసెలు వేసిన వారిపై కేసులు పెడతామని చెప్పి భయభ్రాంతులకు గురి చేయడం సరికాదు కచ్చితంగా గుడిసి వేసుకున్న ప్రతి ఒక్కరికి ఇంటి పట్టాలు మంజూరు చేయాల్సిందే లేదంటే పెద్ద ఎత్తున ఆందోళనలకు శ్రీకారం చుడతామమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బి. కదిరిప్ప సిపిఐ కదిరి డివిజన్ కార్యదర్శి నల్లజోడు పవన్ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చౌడప్ప యాదవ్ మండల కార్యదర్శులు రెడ్డప్ప, అంజనప్ప నాయకులు రవి, నిజాముద్దీన్, రెడ్డప్ప, సుగుణమ్మ పాల్గొన్నారు.

మా భూములు లాక్కోద్దు.. మా నోట్లో మట్టి కొట్టొద్దు

- వ్యవసాయ భూములు.. పరిశ్రమలకు ఇచ్చేది లేదు
- తహసీల్దార్ ఆఫీస్ వద్ద కొండూరు రైతుల నిరసన

విశాలాంధ్ర-లేపాక్షి: ఎన్నో ఏళ్లుగా వ్యవసాయంతోనే జీవనం సాగిస్తున్నామని, మా భూములు లాక్కొని మా నోట్లో మట్టి కొట్టొద్దని కొండూరు పంచాయతీకి చెందిన 200 మంది రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం పరిశ్రమల పేరుతో వేలాది ఎకరాలు రైతుల నుండి ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ప్రస్తుతం రైతుల అనుమతి లేకుండా సర్వే నిర్వహించడం పట్ల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ తాసిల్దార్ కార్యాలయం ఎదు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. రెవిన్యూ అధికారులతో రైతులు మాట్లాడుతూ ఒకసారి గా వ్యవసాయ భూములను ఇంత పెద్ద ఎత్తున ప్రభుత్వం తీసుకుంటుందని ఎప్పుడూ ఊహించలేదన్నారు. తరతరాలుగా వారసత్వంగా వస్తున్న భూములలో ప్రస్తుతం మల్బరీ మామిడి చింత జామ నిమ్మతో పాటు మల్బరీ షెడ్ కోళ్ల ఫారాలు గొర్రెల ఫామ్ నిర్మించుకొని ఆదర్శంగా బతుకుతున్నామని పేర్కొన్నారు. ముఖ్యంగా పంచాయతీ వ్యాప్తంగా కొన్ని వేల పాడియావులు ద్వారా జీవనం చేసే కుటుంబాల పరిస్థితి ఏమన్నారు. అయితే ఈ నిరసనకు మద్దతు ఇచ్చిన సిపిఎం వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఫిరంగి ప్రవీణ్ కుమార్ పెద్దన్న సోమశేఖర్ నారాయణ నాయక్ మహిళా రైతులు అధికారులతో మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యవసాయ భూములు పరిశ్రమలకు ఇవ్వడం జరగదన్నారు. అవసరమైతే ఆమరణ నిరాహార దీక్షతోనే మా భూముల సాధించుకుంటామన్నారు. అంతేకాకుండా ప్రభుత్వ అధికారులు కూడా గ్రామాలలో సభలు నిర్వహించి రైతుల అభిప్రాయాలు తీసుకోవడమే కాకుండా వారి భూభద్రతకు కృషి చేయాలన్నారు. మొదట బస్టాండ్ ఆవరణము నుండి తాసిల్దార్ కార్యాలయం వరకు రైతులు నిరసన ర్యాలీగా వచ్చారు.అనంతరం డిప్యూటీ తాసిల్దార్ కుమార్ రెడ్డి స్వామికి రైతులు విడివిడిగా వినుతులు అందజేశారు. అనంతరం కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న రైతులతో డిప్యూటీ తాసిల్దార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో అధికారులు సర్వే నిర్వహిస్తున్న మాట వాస్తవమని ప్రభుత్వం నిర్ణయానికి ప్రతి రైతు సహకరించి న్యాయపద్ధంగా భూముల అందిస్తే ఈ ప్రాంతం పెద్దపెద్ద పరిశ్రమలతో పెద్ద ఎత్తున అభివృద్ధి చెందడమే కాకుండా భవిష్యత్తుకు లేపాక్షి అభివృద్ధి హబ్ నిలుస్తుంది అన్నారు. అంతేకాకుండా మీ సమస్యలను మీ వెన్నుతులను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో రైతులు నిరసన విరమించారు..

మానవత్వాన్ని చాటుకున్న హెడ్ కానిస్టేబుల్

విశాలాంధ్ర-ధర్మవరం : పట్టణంలోని టూ టౌన్ పోలీస్ స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్ ఏఎల్ నరసింహం తన పుట్టినరోజు సందర్భంగా మండల పరిధిలోని గొట్లూరు గ్రామంలో గల అనాథా శ్రమంలో వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు సమాజంలో మానవతా విలువలు పెంపొందించేలా అందరూ బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. ఆశ్రమ వ్యవస్థాపకులు ప్రఫుల్ల చంద్ర ఆయనకు కృతజ్ఞతలను తెలియజేశారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం : ఆర్డీవో

విశాలాంధ్ర-ధర్మవరం: ధర్మవరం, బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ, చెన్నై కొత్తపల్లి, కనగానపల్లి, రామగిరి మండలాల ప్రజల సమస్యలను పరిష్కరించుటయే ప్రజా సమస్యల పరిష్కార వేదిక ముఖ్య లక్ష్యమని ఆర్డిఓ మహేష్ తెలిపారు. ప్రభుత్వ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఫిర్యాదులోని సమస్యను బట్టి అధికారుల ద్వారా పరిష్కరిస్తున్నామని చెప్పారు. బత్తలపల్లి, చెన్నై కొత్తపల్లి, రామగిరి మండలాల నుంచి ఎటువంటి దరఖాస్తులు రాలేదని, ధర్మవరం నుండి 4, కనగానపల్లి నుండి 01, ముదిగుబ్బ నుండి 2, తాడిమర్రి నుండి 01 దరఖాస్తులు వచ్చాయని, విచారణ చేపట్టి, సంబంధిత అధికారుల ద్వారా పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. కానీ ప్రతి సోమవారం ప్రజలు ఇచ్చే సమస్యలను పలుమార్లు ఇవ్వడం సమంజసం కాదని, సమస్య పరిష్కారం కానీ ఎడల తిరిగి ఆ మండల అధికారికి గాని, నాకు గాని తెలపాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో. ఖతీజూన్ కుబ్రా పాల్గొన్నారు.

650-2 సర్వే నంబర్ బాధితులకు న్యాయం చేయాలి

సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు

6,వ రోజు రిలే దీక్షలు...

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని సర్వే నెంబర్ 650-2పై తగిన న్యాయం చేయాలని కోరుతూ ఏఐటియుసి, కార్మిక సంఘం, ప్లంబర్స్ అండ్ ఎలక్ట్రీషియన్ కార్మిక సంఘం, సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో గత ఆరు రోజులుగా రిలే దీక్షలు చేస్తున్న అధికారుల్లో స్పందన లేదు. దీంతో సిపిఐ, వాటి అనుబంధ సంస్థలు, ఇతర సంఘాలతో కలిసి సోమవారం తాసిల్దార్ కార్యాలయ ఎదుట వంట వార్పు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమ నిర్వహణను సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు ఆధ్వర్యంలో జరిగింది. ఏఐటీయూసీ కార్మిక సంఘం నాయకులు ఎర్రంశెట్టి రమణ, సిపిఐ పట్టణ కార్యదర్శి పూలశెట్టి రవికుమార్, చేనేత కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు వెంకటస్వామి, రిలే దీక్షల లో పాల్గొన్నారు. నియోజకవర్గం కార్యదర్శి ముసుగు మధు మాట్లాడుతూ మూడు నెలల నుంచి ప్లంబర్స్ అండ్ ఎలక్ట్రిషన్స్ కార్మికుల సమస్యల గురించి ఏఐటీయూసీ, సిపిఐ ఆధ్వర్యంలో అనేక ఉద్యమాలు చేపడుతున్న స్పందన రాకపోవడం దారుణం అన్నారు. కార్మికులకు అన్యాయం చేసే విధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇలాగే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. కార్మికులకు న్యాయం జరిగేంత వరకు అండగా ఉంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్లంబర్స్ అండ్ ఎలక్ట్రిషన్స్ కార్మిక సంఘం అధ్యక్షులు గోవిందరాజులు, కార్యదర్శి అన్నం లక్ష్మీనారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆంజనేయులు, తాజుద్దీన్, రామకృష్ణ, రామసుబ్బయ్య,సురేంద్ర, మసూద్, వేణుగోపాల్,ఓబులేసు, నాగేంద్ర, చిన్న, జనార్ధన్, మహిళా నాయకులు లలితమ్మ, లింగమ్మ, ఈరమ్మ తదితరులు పాల్గొన్నారు.

కబ్జాకు గురికాకుండా రోడ్డు స్థలాన్ని కాపాడండి

వ్యవసాయ కార్మిక సంఘం నిరసన

విశాలాంధ్ర-గోరంట్ల: ఆక్రమణ దారుల నుండి రోడ్డు స్థలాన్ని కబ్జాకు గురికాకుండా కాపాడాలని సోమవారం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గోరంట్ల తాసిల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు, అలాగే మండలం లోని గొల్లపల్లి గ్రామం లో చంద్రశేఖర్ అను వ్యక్తి రైతుల పొలాలకు మరియు గ్రామస్థులు ఉపయోగించే బండి రస్తాను ఆక్రమించి ముళ్ల కంచె వేసి అనేక ఇబ్బందులతో పాటు వేధింపులకు గురి చేస్తున్నాడనీ తహసిల్దార్ కు గతంలో కూడా అనేక మార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని తెలిపారు , గ్రామ సర్వేయర్ ద్వారా కొలతలు వేసే హద్దులు చూపించాము అయినా తనలో ప్రవర్తన మారలేదనారు,ఉపాధి హామీ నిధులతో సుమారు 5 లక్షల రూపాయలు రోడ్డు వేయడానికి మంజూరు అయిన రోడ్డును కూడా వేయకుండా అడ్డుపడుతున్నారన్నారు, చట్టబద్ధంగా పరిష్కారం చేయాలని గ్రామస్తులతో కలిసి ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మండల తహసీల్దార్‌కు స్పందనలో ఫిర్యాదు చేశారు ,అనంతరం తహసీల్దార్ మారుతి మాట్లాడుతూ మండల సర్వేయర్‌తో మాట్లాడి ఈ రోజే సమస్యను పరిష్కారం చేసేందుకు అవసరమైతే పోలీసుల సహకారం కూడా తీసుకొని న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు, ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు జిల్లా కార్యదర్శి పెద్దన్న, భవన నిర్మాణ కార్మిక సంఘం నియోజకవర్గ కన్వీనర్ కొండా వెంకటేశ్వర్లు, జిల్లా కమిటీ సభ్యులు నాగభూషణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా గణపతి సచ్చిదానంద స్వామీజీ జన్మదినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని కొత్తపేటలో గల శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ 83వ జన్మదినోత్సవ వేడుకలను సోమవారం గణపతి సచ్చిదానంద జాన బోధ సభా ట్రస్టు, ఎస్డిహెచ్ఎస్ వాలంటీర్లు, భక్తాదుల, అర్చకులు సుదర్శన చార్యులు, భాను ప్రకాష్ నడుమ ఘనంగా నిర్వహించారు. అర్చకులు సుదర్శన ఆచార్యులు, భాను ప్రకాష్ తొలుత వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం గణపతి సచ్చిదానంద స్వామి చిత్రపటానికి వివిధ పూలమాలలతో పాటు అర్చనలు, అభిషేకాలు ప్రత్యేక పూజలను నిర్వహించారు. తదుపరి పల్లకిలో ఎస్ డి హెచ్ ఎస్ వాలంటీర్లు, భక్తాదుల నడుమ పట్టణంలోని పురవీధులలో ఊరేగించారు. తదుపరి అనగాష్టమి వ్రతాన్ని సుఖానంద నిర్వహించారు. స్వామీజీ ఆధ్యాత్మిక ప్రవచనాలు వేలాది మందికి స్ఫూర్తిగా నిలవడం జరిగిందని తెలిపారు. అనంతరం 1000 మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ దత్త శివ, మెడికల్ కుళ్లాయప్ప, రామాంజనేయులు, సాగా సురేష్, రంగా శ్రీనివాసులు, సంజీవులు, ఎస్డిహెచ్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

యోగతో సంపూర్ణ ఆరోగ్యం

విశాలాంధ్ర-అమడగూరు : అంతర్జాతీయ యోగా కార్యక్రమాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తాసిల్దార్ రామనాథరెడ్డి, ఎంపీడీవో మునెప్ప ఉపాధ్యాయులు, గ్రామంలోని యువ కులు యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ నిత్యం యోగ చేయడం ద్వారా మనసు కుదుటపడి సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. యోగా ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో అందరూ భాగస్వాములైతే ఆరోగ్యంగా ఉంటారన్నారు. మే 21 నుండి జూన్ 21వ తేదీ వరకు నెల రోజులపాటు పాఠశాల క్రీడా మైదానంలో ప్రతిరోజు ఉదయం 6 గంటల నుండి ఏడున్నర గంటల వరకు యోగ నిర్వహిస్తామన్నారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన పదో తరగతి పరీక్షలు

విశాలాంధ్ర-కొత్తచెరువు: పదవ తరగతి పరీక్షలు సోమవారం ముగిశాయని డీఈవో కృష్ణప్ప, తెలిపారు సత్యసాయి జిల్లా వ్యాప్తంగా 34 పరీక్ష కేంద్రాలలో సోషల్ పరీక్ష నిర్వహించగా 2911 మంది విద్యార్థులకు గాను 2466 మంది విద్యార్థులు హాజరయ్యారు.445 మంది విద్యార్థులు ఆబ్సెంట్ అయ్యారన్నారు 84.71 శాతం మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. జిల్లావ్యాప్తంగా ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతంగా పరీక్షలు ముగిసాయన్నారు.

కదిరి-కడప మీదుగా శ్రీశైలానికి బస్సు ఏర్పాటు

విశాలాంధ్ర-కదిరి: కదిరి నుండి పులివెందుల, వేంపల్లి, కడప, మైదుకూరు, నంద్యాల మీదుగా శ్రీశైలానికి లగ్జరీ బస్సు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజరు బి.మైనోద్దీన్ తెలిపారు. ప్రతి రోజు రాత్రి 7.30 గంటలకు బయలు దేరి, ఉదయం: 6.15కి శ్రీశైలం చేరుతుందని, తిరిగి శ్రీశైలం నుండి అదే రోజు రాత్రి 6.30 గంటలకు బయలు దేరి కదిరికి ఉదయం: 5.30 కి చేరుతుంద న్నారు. పెద్దలకు రూ. 830.00 సీనియర్ సిటిజన్లకు రూ. 630.00 టికెట్ ధర ఉంటుందని ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం ఉందన్నారు. మరింత సమాచారం కోసం 9959225892కు సంప్రదించాలని కోరారు.

వైసిపి ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడిగా ఎల్లేశ్వర

విశాలాంధ్ర-ఓబుళదేవరచెరువు : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల ఎస్సీసెల్ అధ్యక్షుడి గా ఎల్లేశ్వరను నియమిస్తూ పార్టీ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఎల్లేశ్వర మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో ఇచ్చిన ఈ పదవిని వమ్ము చేయకుండా పార్టీ అభివృద్ధితో పాటు ఎస్సీల అభివృద్ధి కోసం కృషి చేస్తామన్నారు. తన ఎంపికకు కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డికి, ఎంపీపీ తుమ్మల పర్వీన్ షామీర్, మాజీ సొసైటీ అధ్యక్షులు ఎద్దుల రామసుబ్బారెడ్డి, మండల కన్వీనర్ లక్ష్మిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు కుర్లి దామోదర్‌రెడ్డి, నాయకులకు కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ముదిగుబ్బ మండలంలో తాగునీటి సమస్య పరిష్కారం

ప్రత్యేక చొరవ చూపినమంత్రి సత్యకుమార్

విశాలాంధ్ర-ముదిగుబ్బ: మండలంలో తాగునీటి సమస్య గత కొన్ని నెలలుగా ప్రజలను తీవ్రంగా బాధిస్తోంది. ముఖ్యంగా,సత్య సాయి నీటి పంపు మరమత్తుకు గురవడంతో ఈ సమస్య మరింత తీవ్రతరమైంది. ప్రజలు నిత్య జీవితంలో తాగునీటి కొరతను ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ దృష్టికి తీసుకెళ్లడంతో ఈ సమస్యపై ఆయన సత్వర చర్యలు తీసుకున్నారు. ఆయన ఆదేశాల మేరకు, ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ మాట్లాడుతూ మండల గ్రాంట్ నుండి ప్రత్యేక నిధుల ద్వారా రెండు కొత్త విద్యుత్ మోటార్లు కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. ఈ చర్యల ఫలితంగా,మండలంలో ప్రతిరోజు 13 లక్షల లీటర్ల నీటి పంపింగ్ జరగనుంది. ఇది ప్రజలకు నాణ్యమైన తాగునీటిని అందించడంలో కీలకమైన భాగంగా మారనుంది. నీటిని సద్వినియోగం చేసుకోవాలని,వృథా చేయరాదని ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ సూచించారు. నీటి సరఫరా మెరుగుపడడం వల్ల ప్రజల ఆరోగ్యం, జీవనశైలి ఆర్థిక శ్రేయస్సు పెరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో దివాకర్, అర్డబ్ల్యూఎస్ ఏఈ ప్రసాద్, వైస్ ఎంపీపీ వెంకట్ రెడ్డి, టీడీపీ జిల్లా బీసీ జనరల్ సెక్రెటరీ కృష్ణమూర్తి యాదవ్, ఎంపీటీసీ మంజునాథ్, పోడరాలపల్లి సర్పంచ్ నాగభూషణ, రవీందర్ రెడ్డి, గంగాధర్‌రెడ్డి, నాగభూషణ, తెలుగుదేశం బీసీ మండల అధ్యక్షుడు గద్దం మోహన్ యాదవ్, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

మంత్రి సవిత ఆధ్వర్యంలో మహానాడుకు భారీ ఏర్పాట్లు

నియోజకవర్గానికి 120 బస్సులు
గోరంట్ల మండలానికి 30 బస్సులు
పెద్ద ఎత్తున తరలనున్న టీడీపీ శ్రేణులు

విశాలాంధ్ర-గోరంట్ల: కడపలో తెలుగు దేశం పార్టీ ఈనెల 27, 28, 29 తేదీలలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి మహానాడుకు రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖా మంత్రి ఎస్ సవిత ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా పెనుకొండ, గోరంట్ల, సోమందేపల్లి, రోద్దం, పరిగి మండలాలకు 120 బస్సులు ఏర్పాటు చేశారు. ఆయా మండలాలకు చెందిన పార్టీ నాయకులకు, టీడీపీ శ్రేణులు ప్రతి ఒక్కరూ తరలి వెళ్లాలని మంత్రి పిలుపు నిచ్చారు. కేవలం ఒక్క గోరంట్ల మండలానికే 30 బస్సులు ఏర్పాటు చేసినట్లు మండల కన్వీనర్ గుత్తా బాలకృష్ణ చౌదరికి తెలిపారు, సోమవారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో మండలంలోని తెలుగు దేశం పార్టీ డీలర్లు, నాయకులు కార్యకర్తలు, బూత్ ఇన్చార్జిలతో సమావేశం నిర్వహించారు, మహానాడు కార్యక్రమానికి నియోజకవర్గం నుండి బస్సులలో బయలు దేరుతున్న పార్టీ కుటుంబ సభ్యులకు గురువారం ఉదయం అల్పాహారం (టిఫిన్) గోరంట్ల మండల టీడీపీ కన్వీనర్ బాలక్రిష్ణ చౌదరీ ఏర్పాట్లు చేస్తున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీనివాసులు, బాబుల్ రెడ్డి, నరేష్, ఉత్తమరెడ్డి, టీడీపీ నాయకులు, నిత్యశ్రీ జ్యువెలర్స్ నిమ్మల శ్రీధర్,బెల్లాల చెరువు చంద్ర, నిడిమామిడప్ప, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పెద్ద ఎత్తున తరలి రండి

విశాలాంధ్ర-కొత్తచెరువు : కడపలో ఈనెల 27, 28, 29 తేదీల్లో నిర్వహిస్తున్న రాష్ట్ర మహానాడు పండుగకు లక్షలాదిమంది కార్యకర్తలు పుట్టపర్తి నియోజకవర్గం నుంచి తరలిరావాలని తరలిరావాలని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డిలు పిలుపు నిచ్చారు. అందుకు అవసరమయ్యే వాహనాల ఏర్పాట్లకు సంబంధిచి ఆయా మండల నాయకులు కార్యకర్తలతో ప్రత్యేకంగా చర్చించారు. టీడీపీ ఆవిర్భావం నుంచి మహానాడు పండుగను ఘనంగా జరుపుకుంటున్నామని తెలిపారు. ఈసారి తొలి సారిగా రాయలసీమలోని కడపలో కనీవినీ ఎరుగని రీతిలో మహానాడు పండుగను అత్యంత ఘనంగా నిర్వహిస్తోందని చివర రోజైన 29న భారీ బహిరంగ సభ ఏర్పాటు చేశామని తెలిపారు. పుట్టపర్తి కొత్తచెరువు బుక్కపట్నం నల్లమాడ ఓడి చెరువు అమడగూరు , పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని కార్యకర్తలు హాజరయ్యేందుకు ప్రత్యేకంగా వాహనాలను ఏర్పాటుచేసినట్లు తెలిపారు

దాడిలో గాయపడిన వారిని పరామర్శించిన చిలకంమధుసూదన్ రెడ్డి

విశాలాంధ్ర-ధర్మవరం: ఇటీవల మండలంలోని ఏలుకుంట్ల గ్రామానికి చెందిన బిజెపి నాయకులు లక్ష్మీనారాయణ శ్రీనివాసులు పై వైసీపీ గుండాల దాడిలో గాయపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి ఘర్షణలో గాయపడిన ఇరువురిని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ విధమైన దాడులు ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయని, ముందుందు ఇలాంటివి జరగకుండా ప్రభుత్వం గట్టి చర్యలు చేపట్టాలని తెలిపారు. బిజెపి నాయకులపై దాడి చేయడం సిగ్గుచేటని, ఏదైనా ఉంటే చట్ట ప్రకారం చేసుకోవాలే గాని ఇలా దాడులు చేయడం సమంజసం కాదని చెప్పారు. దాడి చేసిన వైసీపీ నాయకులను పోలీసులు వెంటనే అరెస్టు చేసి కేసు నమోదు చేయాలని కోరారు.

ఆయుర్వేద వైద్యశాలలో యోగా పోటీలు

విశాలాంధ్ర - హిందూపురం : హిందూపురం రూరల్ పరిధిలోని సంతేబిదునూరులో ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో ఈనెల 26 నుండి 30వ తేదీ వరకు యోగ పోట నిర్వహిం నిర్వహించనున్నట్లు సంతేబిదనూరు ఆయుర్వేద వైద్యాధికారిణి అనురాధ తెలిపారు. సోమవారం యోగా పోటీలు నిర్వహించామని, ఈ పోటీలలో ముఖ్య అతిథులుగా ఇన్చార్జ్ ఎంపీడీవో. శివకుమార్, పంచాయతీ సెక్రెటరీ శశికళ పాల్గొన్నారు. నేటి నుండి కూడా ఈనెల 30 వరకు నిర్వహిస్తామని, ఈ యోగా పోటీలలో సంతే బిదునూరు గ్రామంలో గల ఆయుర్వేద వైద్యశాలకు విచ్చేసి ఎవరైనా పాల్గొనవచ్చని, విజేతలకు ఆయుష్ శాఖ ద్వారా సర్టిఫికెట్లు పంపిణీ చేస్తామనని, ఆయుష్ వైద్యాధికారిణి వై. అనురాధ తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ నేత్రావతి యోగా శిక్షకులు హరికృష్ణ, శిల్పారాణి తోపాటు పిల్లలు, పెద్దలు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధిని చూసి ఓర్వలేక విమర్శలు

విశాలాంధ్ర-అమరాపురం: మండల కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మడకశిర నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు జయకుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజుపై నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త ఈరలకప్ప చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే రాజు దౌర్జన్యం చేసి చైర్మన్‌ను అవమానించారని చేసిన వ్యాఖ్యలు వాస్తవం లేదన్నారు. అబద్ధపు మాటలు మాట్లాడితే ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. నియోజకవర్గంలో అన్ని గ్రామాలకు త్రాగునీటి సౌకర్యం కోసం బోర్లు గోకులం షెడ్లు గ్రామాల్లో సిసి రోడ్లు రైతులకు ట్రాన్స్ఫార్మర్లు సబ్ స్టేషన్లు మూగజీవాలకు దాహార్తిని తీర్చడానికి ప్రతి గ్రామంలో నీటి తొట్టెలు ఇలా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసి మడకశిర నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తుంటే ఏమీ జరగనట్లు మాట్లాడటం తగదన్నారు. మీకు దమ్ముంటే గత ఐదు సంవత్సరాలలో జరిగిన అభివృద్ధి ఏంటో చర్చకు రావాలని ఈ పది నెలల్లో చేసిన అభివృద్ధి ఏంటో మేము చూపిస్తామని సవాల్ విసిరారు. ఎస్సీ సెల్ అధ్యక్షులు చెన్నప్ప మాట్లాడుతూ నియోజక వర్గంలో ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు మాజీ శాసన మండలి సభ్యులు నియోజకవర్గ ఇన్చార్జ్ గుండుమల తిప్పేస్వామి చేస్తున్న అభివృద్ధిని వైసిపి సమన్వయకర్త కంటికి కనబడడం లేదా అని ప్రశ్నించారు. భవిష్యత్తులో నియోజకవర్గంలో వైసిపి ఉనికి కోల్పోతుందని హితవు పలికారు. కార్యక్రమంలో శకునప్ప మదనకుంట మాజీ సర్పంచ్. హనుమంత రాయప్ప నవీన్ కుమార్ నాగరాజు మంజునాథ్ సిద్దేశ్వర పాల్గొన్నారు.

ఫీజుల విషయంలో వెసలుబాటు ఇవ్వండి

- బడుగు, పేద విద్యార్థుల భవిష్యత్తును చూడండి
- ప్రైవేట్ కళాశాల యాజమాన్యానికి బీజేపీ నియోజకవర్గ ఇంచార్జ్ హరీష్ బాబు విన్నపం

విశాలాంధ్ర-ధర్మవరం : పేద, బడుగు, బలహీన వర్గాలకు నాణ్యమైన విద్యను అందించాలనే సంకల్పంతో కళాశాలలు ముందుకు రావాలని బీజేపీ నియోజకవర్గ ఇంచార్జ్ హరీష్ బాబు కోరారు. సోమవారం ధర్మవరం ఎన్డీఏ (బీజేపీ) కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ధర్మవరం నియోజకవర్గ పరిధిలోని ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యులు కరస్పాండెంట్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి బీజేపీ నియోజకవర్గ ఇంచార్జ్ హరీష్ బాబు అధ్యక్షత వహించారు. అనంతరం హరీష్ బాబు మాట్లాడుతూ, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సూచనల మేరకు విద్యా రంగంలో సమగ్ర అభివృద్ధి కోసం కలిసికట్టుగా పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే, విద్య ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉండేలా ఫీజుల విషయంలో కొంత వెసులుబాటు చూపించే దిశగా యాజమాన్యాలు చొరవ చూపాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని, నాణ్యతతో కూడిన బోధన, మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టాలని సూచించారు. ఈ సందర్భంగా, ధర్మవరం నియోజకవర్గ సమగ్ర అభివృద్ధిలో ప్రతి విద్యా సంస్థ తమ వంతు పాత్రను పోషించాలని, విద్య ద్వారా సమాజానికి సేవ చేయడంలో భాగస్వాములవ్వాలని హరీష్ బాబు ఆకాంక్షించారు. సమావేశంలో పాల్గొన్న కళాశాలల ప్రతినిధులు ఈ సూచనలను హర్షంగా స్వీకరించి, ప్రభుత్వంతో కలిసి విద్యా ప్రమాణాల పెంపుకు కట్టుబడి పనిచేస్తామని హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యేలను విమర్శించే అర్హత ఈరలక్కప్పకు లేదు

విశాలాంధ్ర-అగళి/ రొళ్ల: ఎమ్మెల్యేలను విమర్శంచే అర్హత ఈరలక్కప్పకు లేదని మండల దళిత నాయకులు తీవ్రస్థాయిలో మండి పడ్డారు. మూడు రోజులు క్రితం జిల్లా పరిషత్ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఫోటోలు తొలగించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఫోటోను ఉంచాలని అధికారులను ఆదేశించిన విషయాన్ని వైసిపి నాయకులు పెద్ద రాద్ధాంతం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ విషయంపై మండలకేంద్రంలో సోమవారం మండల దళిత టిడిపి నాయకులు విలేకరులతో మాట్లాడుతూ మడకశిర నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త ఈరలక్కప్ప ఎమ్మెల్యే లను ఉద్దేశించి మాట్లాడిన తీరును తీవ్రంగా ఖండించారు. వైకాపా ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు నియోజకవర్గ అభివృద్ధి గురించి గానీ, సంక్షేమం గురించి గానీ పట్టించుకోకుండా గాలికి వదిలేసి ఇప్పుడు మడకశిర నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి ఈరలక్కప్పకు కానరావడం లేదాని ప్రశ్నించారు. ఎమ్మెల్యేపై మాట్లాడే అర్హత వైసిపికి ఏమాత్రం లేదన్నారు. ఐదేళ్లలో నియోజకవర్గ అభివృద్ధిని గాలికి వదిలేసి కూటమి ప్రభుత్వం సంవత్సరం కాలంలోనే నియోజకవర్గ అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారని రైతులకు 470 ట్రాన్సుఫార్మర్లు పంపిణీ చేసారని మరో 500 ట్రాన్సుఫార్మర్లు త్వరలోనే వస్తున్నాయని తెలిపారు. మడకశిరలో 7500 కోట్లతో సోలార్ ప్రాజెక్ట్ మంజూరు కాగా గుడిబండ మండలంలో మరో 7500 కోట్లతో సోలార్ ప్రాజెక్ట్ కు ప్రతిపాదనలు పంపారని, రూ.1500 కోట్లతో మందుగుండు పిరంగి పరిశ్రమలు ఏర్పాటు, గార్మెంట్స్ ద్వారా నిరుద్యోగులకు ఉపాధి కల్పించడంలో డీఎస్సీ ఉచిత కోచింగ్ ఇప్పించిన ఘనత ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజుదే అన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 150 బోర్లు తాగునీటి సమస్య తీర్చడానికి తవ్వించారని 20 కోట్లతో అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మాణం, 250 గోకులం షెడ్లు మంజూరు చేయించారని తెలిపారు. నిరంతరం నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి కృషి చేస్తున్నారని తెలిపారు. ఓర్వలేకనే ఈరలక్కప్ప నిందారోపణలు చేస్తున్నారని, ఈ సంస్కృతి మానుకోకపోతే భవిష్యత్తులో తీవ్రమైన పరిణామాలు ఎదుర్కొంటారని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు భూతరాజు మాజీ సర్పంచ్ నింగప్ప, ఎంపీటీసీ తనయుడు నాగోజప్ప పాల్గొన్నారు..

రొళ్ల మండల కేంద్రంలో ఈరలక్కప్ప తీరుపై విలేకరుల ఎదుట నియో జకవర్గ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు కృష్ణమూర్తి, నియోజకవర్గం ఎస్సీ సెల్ కార్యదర్శి వి.ఎన్ హళ్లి నారాయణప్ప, మాజీ సర్పంచ్ పాండురంగప్ప, రొళ్ల స్కూల్ కమిటీ చెర్మన్ నాగరాజు, సురేష్ మండిపడ్డారు.

పాఠ్యపుస్తకాల దోపిడీని అరికట్టాలి

విశాలాంధ్ర-ధర్మవరం: ధర్మవరంలో పాఠ్యపుస్తకాలు విక్రయిస్తున్న పాఠశాలలపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాని ఎంఈఓ రాజేశ్వరికి సోమవారం వివిధ విద్యార్థి సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. అనంతరం విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ పాఠశాల ప్రారంభం కాకమునుపే తమ పాఠశాలలో అడ్మిషన్ చేసుకోవాలని, విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. కొన్ని ప్రైవేట్ పాఠశాల వారు హాస్టల్ పర్మిషన్ లేకపోయినా నడుపుతున్నారని, తమ పాఠశాలలోనే పాఠ్యపుస్తకాలు యూనిఫామ్, షూ, టై, బెల్ట్ లాంటివి కొనుగోలు చేసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులను డిమాండ్ చేయడం దారుణం కాదా? అని వారు ప్రశ్నించారు. పుస్తకాల ఒక్కొక్క సెట్టు రూ.6 వేల నుంచి రూ.7 వేల వరకు పాఠ్య పుస్తకాలు విక్రయిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో పిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు మంజుల నరేంద్ర, వైసీపీ జిల్లా అధ్యక్షులు పురుషోత్తం, ఏఐఎస్బి జిల్లా కార్యదర్శి పోతలయ్య, వైయస్సార్‌ఎస్ యు రాష్ట్ర కార్యదర్శి అమర్నాథ్ రెడ్డి, గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandhra.com
కర్నూలు, మంగళవారం 27, మే 2025

అర్జీలను క్షేత్రస్థాయిలో వెళ్లి పరిష్కరించాలి

విశాలాంధ్ర-తాడిపత్రి: అధికారులు క్షేత్రస్థాయిలో వెళ్లి ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ వి.వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ వి.వినోద్ కుమార్ ఎమ్మెల్యే జెసి. అస్మిత్ రెడ్డి జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, డిఆర్ఓ ఏ.మాలోల, ఫారెస్ట్ సెటిల్మెంట్ ఆఫీసర్ జి.రామకృష్ణారెడ్డి, డిప్యూటీ కలెక్టర్ లు రామ్మోహన్, మల్లికార్జున వివిధ శాఖల జిల్లా అధికారులు ప్రజల వద్ద నుండి దాదాపు 364 స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీదారుల నుండి స్వీకరించిన అర్జీలను అధికారులు క్షేత్రస్థాయిలో వెళ్లినేరుగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. ప్రజా పరిష్కార వేదికలో 70 నుండి 80 శాతం భూ సంబంధిత సమస్యలు, సర్వే, పంచాయతీ రాజ్, మున్సిపల్ శాఖలకు సంబంధించి పిటీషన్లు అందుతున్నాయన్నారు. ప్రజల నుండి పలుమార్లు అందే అర్జీలను పరిశీలించడానికి ఒక విధానాన్ని ప్రవేశపెట్టామన్నారు. ఆ విధానంలో ముందుగా అర్జీదారుని ఆధార్ నెంబర్తో గతంలో వారు ఏదైనా అర్జీలను ఇవ్వడం జరిగిందా పరిశీలించాల్సి ఉంటుందన్నారు. ఒకవేళ ఇచ్చి ఉంటే ఏ ఏ సందర్భాల్లో ఇచ్చారో ఆ వివరాలన్నింటిని గులాబీ రంగు పేపర్ నందు నమోదై ప్రింట్ కావడం జరుగుతుందన్నారు. ఆ వివరాలను ఆధారంగా ఆ పిటీషన్ గతంలో ఎందుకు పరిష్కరించలేక పోయారో అధికారులు కూలంకుశంగా పరిశీలించాల్సి ఉంటుందన్నారు. జిల్లా అధికారులు వారంలో ఒకసారి క్షేత్రస్థాయిలోకి వెళ్లి అర్జీలను పరిష్కరించాలన్నారు. అర్జీదారునికి ఎండార్స్మెంట్ రసీదును అందివ్వాలని, దాంతోపాటుగా ఆ ఎండార్స్మెంట్ ను పిజిఆర్ఎస్ వెబ్సైట్ నందు అప్లోడ్ చేయాలన్నారు. దాన్ని ప్రింట్ తీసి పోస్ట్ ద్వారా అర్జీదారునికి పంపాలని, అర్జీ దారుని ఫోన్ నెంబర్ ఆధారంగా వారి వాట్సాప్ కు పంపడంతోపాటు సంబంధిత గ్రామస్థాయి అధికారికి నేరుగా అందించాలన్నారు. అర్జీని స్వీకరించే సమయంలోనే వారు తరుచుగా ఉపయోగించే ఫోన్ నెంబరు మాత్రమే అడిగి నమోదుచేయాలన్నారు. ఈ ప్రక్రియను అధికారులందరూ తప్పనిసరిగా పాటించాలని, వచ్చేవారం నుండి అర్జీదారులకు ఎండార్స్మెంట్ చేరిందని అర్జీదారులు చెప్పేలా చర్యలుండాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పి డిప్యూటి సీఈఓ రామసుబ్బయ్య, డిసిఓ అరుణకుమారి, ఆర్టీసీ ఆర్ఎం సుమంత్, డిఎండబ్ల్యూఓ రామ సుబ్బారెడ్డి, ఎల్డిఎం నరేష్ రెడ్డి, హౌసింగ్ పీడీ శైలజ, సిపిఓ అశోక్ కుమార్, డిఎంహెచ్ఓ డా.ఈబి.దేవి, సర్వే ఏడి రూప్ల నాయక్, జిల్లా మలేరియా అధికారి ఓబులు, డ్వామా పిడి సలిం భాష, పిఆర్ ఎస్ఈ జహీర్ అస్లాం, డిఈఓ ప్రసాద్ బాబు, డిసిహెచ్ఎస్ డా.పాల్ రవికుమార్, ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ కిరణ్ కుమార్, డిటిసి వీర్రాజు, మార్కెటింగ్ ఎడి సత్యనారాయణ చౌదరి, మైన్స్ డిడి వెంకటేశ్వర్లు, బీసీ వెల్ఫేర్ డిడి కుష్బూ కొఠారి, డిటిడబ్ల్యూ ఓ. రామాంజనేయులు, ఐసిడిఎస్ పిడి. నాగమణి, పిజిఆర్ఎస్ తహసీల్దార్ వాణిశ్రీ, మునిసిపల్ కమీషనర్ శివరామకృష్ణ, తాడిపత్రి, పెద్ద పప్పూరు, యాడికి, పెద్దవడుగూరు తాహసిల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

మహానాడు మహాసభను విజయవంతం చేయండి

విశాలాంధ్ర- పెనుకొండ: పెనుకొండ నియోజక వర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు పెనుకొండ మండలంలోని నాయకులు కార్యకర్తలు సమావేశమై, రాష్ట్ర బీసీ సంక్షేమ ఈడబ్ల్యూఎస్ చేనేత జౌళి శాఖ మంత్రి, కడప జిల్లా ఇన్చార్జ్ మంత్రి సవితమ్మ సూచనల మేరకు సోమవారం పెనుకొండ టిడిపి నాయకులు, కార్యకర్తలు సమావేశం నిర్వహించడం జరిగింది, టిడిపి కన్వీనర్లు శ్రీరాములు, ఈశ్వర ప్రసాద్ మాట్లాడుతూ కడపలో ఈనెల 27,28 తేదీలలో తెదేపా పార్టీ ప్రతినిధులు సభ ఉంటుందని, 29 వ కడపలో జరిగే మహానాడుబహిరంగ సభకు మంత్రి సవితమ్మ నియోజక వర్గ వ్యాప్తంగా 100 బస్సులు ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రతి పంచాయతీ నుంచి ఒక బస్సు బయలుదేరబడునని, ఈ బస్సు యాత్ర కి టిడిపి నాయకులు కార్యకర్తలు టిడిపి శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని, 29వ తేదీన ఉదయం 7గంటలకు పెనుకొండలో బయలుదేరుబడునని, కావున మహానాడు బస్సు యాత్రని విజయవంతం చేయాలని, నియోజకవర్గం నుంచి పెనుకొండ మండలం నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు నాయకులు తరలిరావాలని టిడిపి నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నాగలూరు నారాయణస్వామి, కేశవయ్య, రాంపురం శ్రీనివాసులు, చంద్రకాంతమ్మ,రఘు, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

దళితులకు న్యాయం చేయండి

విశాలాంధ్ర-అమరాపురం: మండల పరిధిలోని హేమావతి గ్రామానికి చెందిన నిరుపేద దళిత లక్ష్మమ్మ, మారక్క, సిద్ధప్పలు తమ భూములను అగ్రకులానికి చెందిన వ్యక్తులు అక్రమంగా వన్ బి నమోదు చేయించుకున్నారని తమకు న్యాయం చేయాలని సోమవారం తహసిల్దార్ లక్ష్మీనరసింహం కు వినతి అందజేశారు. సర్వేనెంబర్ 153-1 నందు ఐదు ఎకరాల 76 సెంట్లు ప్రభుత్వ భూమిని పూర్వకాలం నుండి సాగు చేసుకుంటూ అనుభవిస్తున్నామన్నారు. ఈ భూమిని మా గ్రామ పంచాయతీ పరిధిలోని ముగ్గురు అక్రమంగా వన్ బి నమోదు చేసుకొని వాళ్ల పేరిట పట్టాదారు పాసుపుస్తకం చేయించుకున్నారని ఈ విషయంపై వారిని అడగగా మీ భూమి మీ పేరిట చేయించుకోవడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని చెప్పిన వ్యక్తులు మాకు అధికారుల వద్ద స్టేట్మెంట్ రికార్డులకు సంతకాలు చేయకుండా వెళ్లిపోయారని ఫిర్యాదులోపేర్కొన్నారు. నిరుపేదలమైన తమకు తమ సాగు చేస్తున్న భూమిని ఇప్పించి న్యాయం చేయాలని తహసిల్దార్ ను కోరగా దీనిపై విచారణ చేసి న్యాయం చేస్తామని తహసిల్దార్ లక్ష్మీనరసింహం పేర్కొన్నారు.

నేడు మాజీ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-కొత్తచెరువు: కొత్తచెరువు వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద మంగళవారం పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే డి శ్రీధర్ రెడ్డి జన్మదిన వేడుకలను నిర్వహించడం జరుగుతుందని మండల కన్వీనర్ శ్యాంసుందర్ రెడ్డి తెలిపారు. మండలంలోని వైసీపీ నాయకులు కార్యకర్తలు ప్రజాప్రతినిధులు ఉదయం 9 గంటలకు అందరూ తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

న్యాయవాదికి సన్మానం

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ లోని న్యాయవాదుల సమావేశ భవనం నందు సోమవారం సీనియర్ న్యాయవాదులు మరియు బార్ అసోసియేషన్ అధ్యక్షులు వాల్మీకి శ్రీనివాసులు నేతృత్వంలో వైఎస్ఆర్సిపి మండల లీగల్ సెల్ అధ్యక్షుడిగా ఎంపికైన న్యాయవాది బాలాజీని న్యాయవాదుల సమావేశ భవనం నందు ఘనంగా సన్మానించారు, రాష్ట్ర వైస్సార్సీపీ జాయింట్ సెక్రటరి నాగరాజు మాట్లాడుతూ గత ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి యువ న్యాయవాదుల ను ప్రోత్సహించుట కు లా నేస్తం ద్వారా నెలకు 3 వేలు రూపాయలు వారికీ ఇబ్బందులు లేకుండా ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీ న్యాయవాదులు ఆర్థికంగా నిలదొక్కు కోవడానికి చాలా ఉపయోగకరంగా ఉందని కావున యువ న్యాయవాదులు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి అండగా ఉండా లని బాలాజీ ఇంకా అత్యు న్నత పదవులు పొందాలని కోరారు.బాలాజీ మాట్లాడుతూ ఈ అవకాశం ఇచ్చిన పెనుకొండ నియోజకవర్గం ఇంచార్జి ఉషశ్రీ చరణ్ కు కృతజ్ఞతలు తెలిపారుఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాసులు, జావిద్, హరీష్, రవి, నాగిరెడ్డి ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.

మహానాడుకు తరలివెళ్లిన బొమ్మనహల్ టీడీపీ నాయకులు

విశాలాంధ్ర-బొమ్మనహాళ్: మండలం నుంచి టీడీపీ నాయకులు మహానాడుకు బయలదేరి వెళ్లారు. టీడీపీ నాయకులు కడపలో ఈ నెల 27, 28, 29 తేదిలల్లో జరిగే మహానాడుకు ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఆధ్వర్యంలో తెలుగు తమ్ముళ్లు వేళ్లారు. తరలివెళ్లిన వారిలో సింగల్ విండో మాజీ అధ్యక్షులు కొత్తపల్లి మల్లికార్జున, స్టోర్ డీలర్ సంఘం అధ్యక్షులు పయ్యావుల్ల మోహన్, నాయకులు నవీన్, సైకిల్షాప్ హనుమంతు, క్రిష్ణాపురం శీనా, గాలి బసప్ప, సంగప్ప తరలి వెళ్లారు.

ప్రజా పోరు యాత్ర

విశాలాంధ్ర-గుంతకల్లు: ప్రజా సమస్యల పరిష్కారం కొరకై ప్రజా పోరు యాత్రను సిపిఎం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓ.నల్లప్ప జెండా ఊపి ప్రారంభిస్తూ పట్టణంలో 24, 25 వార్డుల యందు యాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప మాట్లాడుతూ,కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న 123 పట్టణ ప్రాంతాలలో 463 కోట్ల ఆస్తి ఇంటి పన్ను భారం మోపేందుకు మున్సిపాలిటీలకు జీవోలు జారీ చేసింది గత వైసిపి ప్రభుత్వం చేసిన జివో ప్రతి ఏడాది ఆస్తి పన్ను సంవత్సరానికి 15% ఆటోమెటిగ్గా పెంచుకునే విధానాన్ని రద్దు చేస్తామని చెప్పి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సర పాలనలో ఆ 15% రద్దు చేయకపోగా అదనంగా రాష్ట్ర ప్రజల మీద 20% అదనంగా భారం మోప నుంది ఈ భారం పట్టణ ప్రజల మీద 2 కోట్ల 36 లక్షల రూపాయలు భారం పడనుంది.దీని ప్రకారం ప్రస్తుతం ఇంటిని, ఖాళీ స్థలాలను కొలతలు వేస్తారు నిబంధనలు అతిక్రమించిన వాటికి అదనంగా పెంచుతారు ఇంట్లో సొంత ఉపాధి కోసం షాప్ పెట్టుకుంటే వాణిజ్య పన్ను కిందికి మారుస్తారునీ అన్నారు. వృత్తి పన్ను దారి మళ్ళిస్తారు. ఇందులో భాగంగానే జూన్ నెల నుండి మున్సిపల్, సచివాలయాల అధికారులు సిబ్బంది ఇంటింటికి సర్వేలు చేపడుతున్నారు పట్టణ ప్రజల మీద అదనపు భారాలు మోపే ఈ సర్వేలను ప్రజలు అడ్డుకోవాలనీ అన్నారు. ఈ ప్రజా పోరు యాత్రలో సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి మారుతి ప్రసాద్ పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు సాకే నాగరాజు, సురేంద్రబాబు, రంగమ్మ, పట్టణ కమిటీ సభ్యులు తిమ్మప్ప, ఓబులేసు, అబ్దుల్లా, షాషా, రాము నాయక్, జయమ్మ, ఖాదర్ బాషా, డేనియల్, ఈరన్న, నాగరాజు, ప్రభాస్, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర-బొమ్మనహాళ్: మండల పరిధిలోని ఎల్బీనగర్ గ్రామంలో బళ్లారి, కళ్యాణదుర్గం రహదారిపై జరిగిన ప్రమాదంలో గ్రామానికి చెందిన వై. శ్రీనివాసులు కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు మేరకు సోమవారం మధ్యాహ్నం తోటలోనుంచి ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతుండగా బళ్లారి వైపు నుండి వస్తున్నా లాగేజి బొలెరు వాహనం డీ కొట్టింది. దీంతో శ్రీనివాసులు వాహనం బొలెరు కిందకు దూసుకేళ్లింది. శ్రీనివాసులు తలకు, కాలుకు తీవ్ర గాయాలు కాగా స్థానికులు వెంటనే ప్రైవేట్ వాహనంలో బళ్లారి ఆసుపత్రికి తరలిం చారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు అన్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. సమాచారం తెలుసుకున్నా బొమ్మనహాళ్ పోలీసులు సంఘటన స్థలన్నికి చేరుకుని విచారిస్తున్నారు.

మండల సర్వేయర్ అండతో రెచ్చిపోతున్న అనధికార సర్వేయర్

విశాలాంధ్ర-గుడిబండ: గుడిబండ మండలంలోని ఓ అనధికార సర్వేయర్ మండల సర్వేయర్ అండతో భూ సర్వేలో అక్రమాలకు పాల్పడుతున్నాడు. గ్రామ ప్రభుత్వ సర్వేయర్లను కాదని మండల సర్వేయర్ ఓ అనధికార సర్వేయర్ను వెంట తీసుకువెళ్ళి సర్వేలు నిర్వహిస్తుండడంపై గ్రామ ప్రభుత్వ సర్వేయర్లు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం పై గ్రామ సర్వేయర్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు కూడా చేశారు. కానీ ఈ విషయంలో ఉన్నతాధికారులు కూడా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్న తీరు ప్రజలను విస్మయానికి గురిచేస్తోంది. మండల సర్వేయర్ అనధికార సర్వేయర్ ను దళారిగా పెట్టుకుని రైతులు వద్ద నుండి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఏకపక్షంగా సర్వేలు నిర్వహిస్తుండడం,సబ్ డివిజన్లు చేయిస్తుండటం వల్ల రైతుల మధ్య గొడవలకు కారణం అవుతున్న అనధికార సర్వేయర్ పై చర్యలు తీసుకోవాలని అలాగే ఆ సర్వేయర్ కు ప్రాధాన్యత కల్పించి ప్రోత్సహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. మరి ఈ విషయం పై ఉన్నతాధికారులు ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాలి.

పాఠ్యపుస్తకాల దోపిడీని అరికట్టాలి

విశాలాంధ్ర-ధర్మవరం: ధర్మవరం పట్టణంలో ఉన్నటువంటి ప్రైవేట్ పాఠశాలలో పాఠ్యపుస్తకాలు విక్రయిస్తున్నటువంటి పాఠశాలలపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలి అని ధర్మవరం మండల విద్యాశాఖ అధికారి రాజేశ్వరికు వివిధ విద్యార్థి సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. అనంతరం విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ ధర్మవరం పట్టణంలో ప్రైవేట్ పాఠశాల వారు అక్రమ అడ్మిషన్లు చేపడుతున్నారని, పాఠశాల ప్రారంభం కాకమునుపే మా యొక్క పాఠశాలలో అడ్మిషన్ చేసుకోవాలి అని, విద్యార్థులను, విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నారు అని మండిపడ్డారు. అదేవిధంగా మరోవైపు ధర్మవరం పట్టణంలో కొన్ని ప్రైవేట్ పాఠశాల వారు హాస్టల్ పర్మిషన్ లేకపోయినా నడుపుతున్నారు అని, అదేవిధంగా ప్రైవేట్ పాఠశాలలో నే పాఠ్యపుస్తకాలు యూనిఫామ్, షూ, టై, బెల్ట్ లాంటివి మా యొక్క పాఠశాలలోనే కొనుగోలు చేసుకోవాలని విద్యార్థులను విద్యార్థుల తల్లిదండ్రులను ప్రవేట్ పాఠశాల వారు డిమాండ్ చేయడం దారుణం కాదా? అని వారు ప్రశ్నించారు. పుస్తకాల ఒక్కొక్క సెట్టు 6000 నుంచి 7000 రూపాయల వరకు పాఠ్య పుస్తకాలు విక్రయిస్తున్నారు అని,అదే విధంగా ఏ ఒక్క ప్రైవేట్ పాఠశాల వారు కూడా ఫీజ్ స్ట్రక్చర్ నోటీసు బోర్డులో అతికించకుండా వేల రూపాయలు ఫీజులు వసూలు చేస్తున్నారు అని తెలిపారు.ప్రైవేట్ పాఠశాల పై తక్షణమే ప్రైవేట్ పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో భవిష్యత్తులో పాఠశాలలు ఎదుట, ప్రభుత్వ కార్యాలయాలు ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పి ఎస్ యు రాష్ట్ర అధ్యక్షులు మంజుల నరేంద్ర, వైయస్సార్ఎస్ యు జిల్లా అధ్యక్షులు పురుషోత్తం, ఏఐఎస్బి జిల్లా కార్యదర్శి పోతలయ్య, వైయస్సార్ఎస్ యు రాష్ట్ర కార్యదర్శి అమర్నాథ్ రెడ్డి, గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ పొందిన వ్యక్తికి సన్మానం

విశాలాంధ్ర-కూడేరు : మండల కేంద్రంలోని కూడేరులో ఆదివారం.డ్రామా కళాకారుల ఆధ్వర్యంలో తమిళనాడు ఆసియా ఇంటర్నేషనల్ డాక్టరేట్ పొందిన జిల్లా రాష్ట్ర అవార్డుల గ్రహీత వి.హెచ్.పి.ఎస్. రాష్ట్ర అధికార ప్రతినిధి ఓ.పెద్దన్నకు ఘన సన్మానం చేశారు. అందులో భాగంగా కళాకారులను ప్రజలను ఉద్దేశించి పెద్దన్న మాట్లాడుతూ. సామాజిక సేవ. చేయడం.ద్వారా ప్రజలచే మంచి. గుర్తింపు. పొందవచ్చునని తెలిపారు.. అనంతరం మండలంలోని కళాకారులకు సన్మానాలు చేసి ప్రశంసా పత్రాలు.అందజేశారు.

హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులు ఆపండి

విశాలాంధ్ర-ఆత్మకూరు: హంద్రీనీవా కాలువ పై లైనింగ్ పనులు ఆపి వెడల్పు చేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. హంద్రీనీవా కాలువపై పిల్ల కాలవలు ఏర్పాటు చేసి చివరి ఆయకట్టు వరకు తాగు సాగు నీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో ఉన్న రైతాంగానికి ఉపయోగపడే విధంగా బోర్లు ఎండిపోకుండా భూగర్భ జలాలు పెరగాలంటే కాలువ లైనింగ్ పనులు తక్షణం ఆపాలన్నారు. ఇప్పటికే రైతాంగం చేసిన అప్పులు తీర్చలేక పంటలు కాపాడుకొనుటకు లక్షలాది రూపాయలు ఖర్చు చేసి బోర్లు వేస్తున్న పరిస్థితి కనపడుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో భూగర్భ జలాలు పెరగాలంటే లైనింగ్ పనులు ఆపాలి. అదేవిధంగా గొర్రెల కాపరులకు పశువులకి చెరువులు కుంటలు నింపడం వల్ల ఈ కాపరులు తాగునీటి సమస్య కూడా తీరుతుందన్నారు. గత 12 సంవత్సరాల నుండి కూడా పిల్ల కాలువలు ఏర్పాటు చేయకుండా ప్రభుత్వము అధికారులు కాలయాపన చేస్తున్నారు. లైనింగ్ వలన భవిష్యత్తులో తూములు పెట్టే అవకాశం కూడా ఉండదు. అందుకు ప్రభుత్వం వెంటనే లైనింగ్ కాలువ లైనింగ్ పనులు ఆపి వెడల్పు చేసి రైతులందరినీ ఆదుకోవాలని సిపిఎం జిల్లా కమిటీగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యురాలు సావిత్రి, మండల కార్యదర్శి శివ శంకర, రాము, రాజేశ్వరి, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

భాషాపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని బాబు జగ్జీవన్ రామ్ నగర్లో గల ప్రధాన పౌర శాఖ గ్రంథాలయంలో ఉచిత శిక్షణా కార్యక్రమంలో భాగంగా తెలుగు ఆంగ్లంపై తప్పనిసరిగా పట్టు ఉండాలని, రాయిటలో చదువుటలో ప్రత్యేక శ్రద్ధ ఎంతైనా అవసరము అని గ్రంథాలయ అధికారిని అంజలి సౌభాగ్యవతి తెలియజేశారు. ఈ సందర్భంగా అంజలి సౌభాగ్యవతి మాట్లాడుతూ చదువుతోపాటు తెలుగు, ఆంగ్లం విషయంలో మంచి మెలకువలను తెలుసుకోవాలని తెలియజేశారు. అదేవిధంగా నీతి కథలు కూడా తెలుసుకోవాలని తెలిపారు. తదుపరి ప్రభుత్వ ఆదేశాల మేరకు యోగా ఆసనాలు కూడా నేర్పించడం జరిగిందని యోగా వల్ల చక్కటి ఆరోగ్యము, శరీర ధృఢత్వం కలుగుతుందని తెలిపారు. ఈ శిబిరం జూన్ 6వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. గ్రంథాలయాలలో చదువు, పోటీ పరీక్షలు, వివిధ విభాగాలకు చెందిన అంశాలకు గల పుస్తకాలు కూడా ఉచితంగా లభిస్తాయి అంతేకాకుండా మా గ్రంథాలయంలో ఉచిత సభ్యత్వములు కూడా నిర్వహిస్తున్నామని కేవలం ఆధార్ కార్డు జిరాక్స్ ఇచ్చినచో, రుసుమును దాతల ద్వారా సేకరించడం జరుగుతుందని ఇటువంటి అవకాశాన్ని కూడా పాఠకులు, నిరుద్యోగులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో 20 మంది విద్యార్థులు పాల్గొన్నారు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది రమణ నాయక్, సత్యనారాయణ, శివమ్మ, గంగాధర్, పాఠకులు పాల్గొన్నారు.

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం..

విశాలాంధ్ర-లేపాక్షి : ప్రస్తుత కాల పరిస్థితుల్లో ప్రతి ఒక్కరికే ప్రతిరోజు యోగ ఎంతో సంపూర్ణ ఆరోగ్యం అందిస్తుందని ప్రతి ఒక్కరు యోగాన్ని దినచర్యగా ఉంచుకోవాలని తాసిల్దార్ సౌజన్య లక్ష్మి ఆయుర్వేద డాక్టర్ సాహితీ సూచించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవంను పురస్కరించుకుని యోగా కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలన్న ఉద్దేశ్యంతో అధికారుల ఆధ్వర్యంలో సోమవారం ఉదయం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ నంది విగ్రహం నుండి బస్టాండు వరకు నిర్వహించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవంను పురస్కరించుకుని యోగా శిక్షణా తరగతులు జరుగుతున్న ఈ నేపథ్యంలో మరింత ప్రచారం చేయడం వలన యోగాపై మరింత ఆసక్తిని పెంచే విధంగా ర్యాలీలో అవగాహన కల్పించడం జరిగిందని తహసిల్దార్ పేర్కొన్నారు. డిప్యూటీ తహసిల్దార్ కుమార్స్వామిరెడ్డి, యోగా ఉపాధ్యాయుడు శ్రీనివాసరెడ్డి, వలంటీర్లు పాల్గొన్నారు.